క్లుప్తంగా

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

రాజోళి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎంవీ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి పలు సమస్యలపై చర్చించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, నాణ్యతగా మధ్యాహ్న భోజనం అందించాలని, బాల్యవివాహాలను నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, నిర్మలజ్యోతి, ఎంపీఓ ఖాజా పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

ఎర్రవల్లిచౌరస్తా: శ్రావణ రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని బీచుపల్లి క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు గురువారం ప్రకటనలో తెలిపారు. సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో భక్తులకు పూజాసామగ్రితోపాటు వెండి నాణెం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రజావేదిక

ఎర్రవల్లిచౌరస్తా: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీపై శుక్రవారం ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సెప్టెంబర్ 2019 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై 13వ విడత సామాజిక తనిఖీ నిర్వహించి రూపొందించిన నివేదిక వివరాలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

విలేకరులపై కేసీఆర్ తీరు శోచనీయం

అయిజ: విలేకరులు అడిగే ప్రశ్నలకు సీఎం కేసీఆర్ సమాధానం చెప్పలేక బెదిరింపులకు పాల్పడడం శోచనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వమని సీఎం కేసీఆర్ బెదిరించడం తగదన్నారు. తెలంగాణ ఉద్యమంలో విలేకరులు సహకరించకుంటే పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచించుకోవాలన్నారు. విలేకరులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను హైకోర్టు ప్రకటించడంతో సంబరాలు నిర్వహించారు. హైదరాబాద్‌లో డీకే అరుణను కలిసి అభినందనలు తెలిపారు.

బీజేపీ నాయకుల సంబరాలు

గట్టు: బీజేపీ నాయకురాలు డీకే అరుణకు అనుకూలంగా హైకోర్టు తీర్పు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో రాజప్ప, భాస్కర్, రమేష్, నాగయ్య, లక్ష్మణ్, మూర్తి పాల్గొన్నారు.

వైద్యవిద్యలో రాణిస్తున్న అక్కాతమ్ముడు



గట్టు: మండలంలోని తుమ్మలపల్లికి చెందిన అక్కాతమ్ముడు ఎంబీబీఎస్ సీట్లు సాధించి వైద్యవిద్యలో రాణిస్తున్నారు. స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మలపల్లి నర్సన్న మనువరాలు శ్యామల 2022–23 నీట్‌లో 720 మార్కులకుగాను 389 మార్కులు సాధించి, మల్లారెడ్డి కళాశాలలో వైద్యవిద్య అభ్యసిస్తుండగా.. మనువడు రవీంద్రనాథ్ 2023–24లో 400 మార్కులు సాధించి చేవెళ్ల మెడికల్ కళాశాలలో సీటు పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైతు కుటుంబానికి చెందిన అక్కాతమ్ముడు వైద్యవిద్యలో రాణించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత



కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వివిధ గ్రామాల్లో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి గురువారం రాయచూర్‌కు తరలిస్తుండగా, పోలీసులు మల్లాపురం తండా శివారులోని పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశామని, బియ్యం తరలిస్తున్న వారు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలగానే కల్లాలు!



సాసనూలులో ఏర్పాటు చేసిన కల్లం

- చాలీచాలని నిధులతో నిరాసక్తి
- సన్నకారు రైతులకు స్థల సమస్య
- యూనిట్లు మంజూరైనా ముందుకు సాగని పనులు
- అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం

ఎర్రవల్లిచౌరస్తా: రైతులకు కల్లాలు ఎంతో అవసరం. పండించిన పంటను నూర్పిళ్లు చేయడం, ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కల్లాలు ఎంతో ఉపయోగపడుతాయి. వ్యవసాయ పొలాల్లో కల్లాలు లేకపోవడంతో కొందరు రైతులు రోడ్లపైనే నూర్పిళ్లు చేసి.. ధాన్యం ఆరబెట్టాల్సిన పరిస్థితి ఉంది. రైతులకు కల్లాలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో నిర్మాణ పనులు చేపడుతోంది. ఇందుకుగానూ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అయితే కల్లాల నిర్మాణానికి అరకొర నిధులు కేటాయించడంతో రైతులు ఆసక్తి చూపడంలేదు. సన్నకారు రైతులకు స్థల సమస్యతో వెనుకంజ వేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గానికి 1,281 యూనిట్లు మంజూరు కాగా.. ఇప్పటివరకు 511 యూనిట్లను మాత్రమే నిర్మించుకున్నారు. మిగిలిన 770 యూనిట్లలో అవగాహన లోపంతో నిర్మాణ పనులను ప్రారంభించలేదు. కల్లాలను నిర్మించుకోవడం వల్ల రైతులు పండించిన పంటను వ్యవసాయ పొలంలోనే ఆరబెట్టుకునే అవకాశం ఉంటుంది. కల్లాల ఆవశ్యకతపై సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్లాల ఆవశ్యకతపై అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

అనుమతులు ఇలా..

కల్లాల నిర్మాణాలను అధికారులు మూడు రకాలుగా విభజించారు. రైతుల పొలాల్లో అందుబాటులో ఉన్న స్థలాలకు అనుగుణంగా కల్లాల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. 50 మీటర్ల (538 చ.అ. కల్లాన్ని నిర్మిస్తే రూ.56,187, 60 మీటర్లకు (645 చ.అ.) రూ.68వేలు, 75 మీటర్లకు (807 చ.అ.)గానూ రూ.85వేల చొప్పున బిల్లులను మంజూరు చేస్తున్నారు.

మండలాల వారీగా వివరాలు..

మండలం	మంజూరు	పూర్తయినవి
ఇటిక్యాల	238	58
మానవపాడు	110	104
ఉండవెల్లి	123	66
అలంపూర్	184	33
రాజోళి	196	84
వడ్డేపల్లి	174	60
అయిజ	256	106

అవగాహన కల్పించాలి..



మా గ్రామంలో 20 యూనిట్లకుపైగా కల్లాలు మంజూరయ్యాయి. అవగాహన లోపంతో రైతులు ముందుకు రావడం లేదు. ఇప్పటివరకు కేవలం రెండు యూనిట్లను మాత్రమే నిర్మించారు. స్థానిక అధికారులు గ్రామాల్లో పర్యటించి కల్లాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. ముఖ్యంగా కల్లాలు నిర్మించుకున్న రైతులకు సకాలంలో బిల్లులు మంజూరు చేయాలి.

–లక్ష్మన్న, రైతు, సాసనూలు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



మండలంలో ఇప్పటి వరకు 238 మంది రైతులు కల్లాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులందరికీ ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. నిర్మాణ ఖర్చులు పెరగడంతో రైతులు కల్లాలను నిర్మించుకోవడానికి ముందుకు రావడంలేదు. వీటికయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– అనిల్, ఏపీఓ, ఇటిక్యాల

అర్హులందరికీ 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ఉండవెల్లి: అర్హులందరికీ గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని బీఎస్పీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికలో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శోభారాణిగౌడ్, ప్రభుదాస్, శివశంకర్‌గౌడ్, రాజు, అయ్యన్న పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అయిజ: దివ్యాంగుల పింఛన్ రూ.4,016లకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండలంలోని ఎక్లాస్‌పురంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత, బీఆర్ఎస్ నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ



పైపాడులో మాట్లాడుతున్న సీఐ శివశంకర్‌గౌడ్

శాంతినగర్: ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి నేరాలను నియంత్రించాలని సీఐ శివశంకర్‌గౌడ్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం వడ్డేపల్లి మున్సిపాలిటీలోని పైపాడులో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 20 బైక్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు నరేష్, నరేష్‌కుమార్, రాము, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని రేవులపల్లిలో పోలీసులు కమ్యూనిటీ కనెక్టివిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికెళ్లి వివరాలు సేకరించారు. సరైన ధ్రువపత్రాలు లేని 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎస్ఐ శివానందంగౌడ్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు జాగ్రత్తగా చేపట్టాలి



మానవపాడులో మాట్లాడుతున్న అధికారులు

శాంతినగర్: కొత్తగా ఓటర్ల నమోదు, జాబితాలో చేర్పు మార్పులను జాగ్రత్తగా చేపట్టాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. వడ్డేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా తయారీపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మానవపాడు: ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ జహీర్ మొహినుద్దీన్, ఎంపీడీఓ రమణారావు బీఎల్ఓలకు సూచించారు. మండల కేంద్రంలో బీఎల్ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని సూచించారు. బీఎల్ఓలకు అధికారులు అప్పగించిన పనులను బాధ్యతగా పూర్తి చేయాలని తెలిపారు.

తప్పులతడకగా జాబితా

ధరూరు: ఇటీవల బీఎల్ఓలు తయారు చేసిన ఓటరు జాబితా తప్పులతడకగా ఉందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన పేరు గూడ్డెందొడ్డి 28వ బూత్‌లో ఉండాల్సి ఉండగా.. మాల్‌దొడ్డి జాబితా అయిన 29వ బూత్‌లో చూయిస్తోందని తెలిపారు. తాను గూడ్డెందొడ్డిలో నివాసం ఉన్నప్పటికీ మాల్‌దొడ్డిలో ఉన్నట్లు ఓటరు జాబితా రూపొందించడం సరికాదన్నారు. దీనిపై బీఎల్ఓలను సంప్రదించగా.. ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో తప్పు దొర్లి ఉంటుందని, సరి చేస్తామని చెప్పారన్నారు. విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే వీఎం అబ్రహం



ఉండవెల్లిలో కృష్ణ తల్లిదండ్రులతో ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేస్తేనే విజయం సాధ్యమవుతోందని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. అయిజ మండలంలోని పులికల్, బింగిదొడ్డి, మున్సిపాలిటీ, మానవపాడు మండలం ఏ-బూడిదపాడు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా రెండోసారి అవకాశం దక్కడంతో శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. అదేవిధంగా పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన లోకనాథ్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అబ్రహం అందజేశారు. కార్యక్రమంలో నీలంగౌడ్, షాబాద రవి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఉండవెల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని తక్కశీలలో రూ.15లక్షలతో సీసీరోడ్డు, రూ.5లక్షలతో చర్చి ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతోపాటు జాతీయ రహదారి నుంచి ఇటిక్యాలపాడు మీదుగా తక్కశీల వరకు బీటీరోడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఇస్రోలో విధులు నిర్వహిస్తున్న కృష్ణ తల్లిదండ్రులు లక్ష్మీదేవి, మద్దిలేటిని ఎమ్మెల్యే సన్మానించారు. చంద్రయాన్–3లో ఉండవెల్లికి చెందిన కృష్ణ భాగస్వామి కావడం సంతోషంగా ఉందని తెలిపారు. అదేవిధంగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కృష్ణ తల్లిదండ్రులను సన్మానించి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, సర్పంచ్ మద్దమ్మ, వైస్‌ఎంపీపీ దేవన్న, నీలంగౌడ్, లోకేశ్వర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, కొండన్న, రమణ, కృష్ణ, లింగారెడ్డి, పుల్లారెడ్డి, సయ్యద్ రెహ్మాన్‌బాషా, సుంకన్న, రాజశేఖర్, చిన్నబాస్ మియా, మక్తర్‌బాషా, శ్రీరాములు, భాస్కర్‌రెడ్డి, రమణ, బాలు, నాగేష్, దేవేంద్ర, నాగరాజు, రమేష్, రాజురెడ్డి, నయీం, మద్దిలేటి, నర్సన్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



గట్టు: మండలంలోని మాచర్ల 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రీస్కూల్ నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతినెలా చిన్నారుల బరువును నమోదు చేయాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అంగన్‌వాడీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

మట్టి అందజేత



శాంతినగర్: నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టిని గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీఓ రవీంద్రకు అందజేశారు. దేశ అమరవీరులకు నివాళులర్పించేందుకుగానూ ప్రధానమంత్రి పిలుపుమేరకు నా మట్టి–నా దేశం కార్యక్రమం చేపట్టి మట్టి సేకరించినట్లు తెలిపారు. గ్రామాల్లో సేకరించిన మట్టిని దేశ రాజధానికి పంపించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

అయిజ: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు. మండలంలోని నౌరోజ్ క్యాంపు, ఈడుగోనిపల్లి గ్రామాల్లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ : వ్యక్తికి గాయాలు

గద్వాల క్రైం: రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన పట్టణంలోని రాజీవ్ మార్గంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... నందిన్నెకు చెందిన బోయ నర్సింహులు, పట్టణంలోని వడ్డేవీధికి చెందిన ఉదయ్‌కిరణ్ బైక్‌లు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ప్రమాదంలో నర్సింహులుకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రజాతీర్పే అంతిమం



గట్టులో డీకే అరుణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల రూరల్: ప్రజాక్షేత్రంలో ఓడిపోయిన నాయకులు.. దొడ్డిదారిన ప్రజాప్రతినిధులుగా కొనసాగాలనుకోవడం హాస్యాస్పదమని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే అంతిమమని, దానిని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అలా కాకుండా కోర్టుల ద్వారా ఎమ్మెల్యేలు అవుదామనుకోవడం సరైంది కాదన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని, తాము సుప్రీంను ఆశ్రయించి ప్రజాతీర్పే గొప్పదని నిరూపిస్తామన్నారు. అదేవిధంగా దివ్యాంగులకు పింఛన్ ప్రొసీడింగ్స్ అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, జెడ్పీటీసీ రాజశేఖర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, శ్రీనివాసులు, హరిగౌడ్ ఉన్నారు.

గట్టు: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు డీకే అరుణ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కృష్ణమోహన్‌రెడ్డికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా దొడ్డిదారిన ఎమ్మెల్యే కావాలనుకోవడం దారుణమన్నారు. ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచులు నర్సింహులు, నల్లన్నగౌడ్, చెన్నరాయుడు, ఎంపీటీసీ రంగస్వామి, బజారి, కృష్ణ, రామునాయుడు, సంతోష్, వెంకటేష్, నవీన్‌చారి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సీఎం ఆఫీస్ ముట్టడిస్తాం



నోటిఫికేషన్ కాపీలను దహనం చేస్తున్న ఏఎన్ఎంలు

గద్వాల అర్బన్: సెకండ్ ఏఎన్ఎంలు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించకపోతే సీఎం క్యాంపు ఆఫీస్‌ను ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు హెచ్చరించారు. ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టిన సమ్మె గురువారంతో 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏఎన్ఎంల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ కాపీలను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు 20ఏళ్లుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజారోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, జ్యోతి, హైమావతి, అరుణ, సరస్వతి పాల్గొన్నారు.

చంద్రయాన్–3 విజయోత్సవం



మానవపాడులో విద్యార్థుల మానవహారం

గద్వాలన్యూటౌన్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో గురువారం జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక విశ్వం అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు చేపట్టిన విజయోత్సవ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రయాన్–3 నమూనా, జాతీయ పతాకాలతో విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పత్తి శ్రీధర్, కౌన్సిలర్లు నరహరి శ్రీనివాసులు, టీ.శ్రీనివాసులు, బీఆర్ఎస్ నాయకులు బొట్టు సుధాకర్, శంకర్, రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

అలంపూర్: ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి, ప్రిన్సిపాల్ హృదయరాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలో ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చంద్రయాన్–3లో ఉండవెల్లికి చెందిన కృష్ణ భాగస్వామి కావడం గర్వకారణమన్నారు. అధ్యాపకులు సృజన, సుధారాణి, వెంకటరాణి, దేవేందర్‌రెడ్డి, మదన్మోహన్, రాముడు, రాజు, రాంచంద్రయ్య, రఘువీర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చంద్రయాన్–3 నమూనాను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లుగౌడ్, సుందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రాజగోపాల్‌రెడ్డి, ప్రసన్న, అనిత పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇస్రో అక్షర రూపంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.



అలంపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



గద్వాలలో విజయోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజారెడ్డి

మల్దకల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఎంపీపీ రాజారెడ్డి సూచించారు. మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన డాక్టర్ అశోక్, ప్రియాంక దంపతుల కుమారుడు శ్రేయాన్స్ రాఘవ పుట్టినరోజు సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఇటీవల పాఠశాల పూర్వవిద్యార్థులు అగ్నిమాపకశాఖ ఎస్ఐగా, మరొకరు డాక్టర్‌గా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యారెడ్డి, సర్పంచ్ లక్ష్మన్న, సింగిల్‌విండో డైరెక్టర్ రంగన్న, ఎంపీటీసీ రూతమ్మ, మాజీ సర్పంచ్ తిమ్మప్ప పాల్గొన్నారు.